
# ఆకలి హత్య

— సతీష్ చందర్



చావును మరిగిన సంజీవరావు నిజంగా చచ్చిపోయాడు. కేలెండర్ చూస్కో లేదు కాబోలు. మంగళవారంనాడు ప్రాణం విడిచాడు లేకుంటే ఆరు అమంగళ వారాల్ని వదిలేసేవాడు కాదు.

అతడికి రాశులు తెలీవు. అయినా అతడి జాతకాన్ని ధాన్యపు రాశుల్లో పూడ్చి పెట్టారు.

ఆయుష్షునంతా పందికొక్కులు కొరికి పారేస్తే చావక చస్తాడా?

సంజీవరావు కళ్ళు తెరిచి చచ్చిపోలేదు. చచ్చాక కళ్ళు తెరిచాడు. చావంటే కదలక పోవడం కాదు. కలో నిజమో తెలీక గిల్లుకున్నాడు. గోళ్ళు గాయపడ్డాయి. ఇది చావు లక్షణమే.

ఎన్నో యేళ్ళు పిండి మిల్లులా పాడి పాడిగా కొట్టుకున్న గుండెకాయ చల్లబడింది. ఆగితే ఆగిందికాని కాస్త చెమ్మగిల్లింది.

ఇంత జరిగినా తన చావు మీద నమ్మకం కుదరడం లేదు. బతికున్నప్పుడు బతుకు మీదా అంతే అపనమ్మకం. మూఢ నమ్మకాల దేశంలో అపనమ్మకాలుండకూడదు.

సంజీవరావు దేశ భక్తుడు కాదు. ఆ మాట కొస్తే బెదురు కాల్పుల్లో చంపదగ్గవాడు. ఏం లాభం? చట్టం కళ్ళల్లో కారం కొట్టి మరీ చచ్చిపోయాడు.

భోజన హోటల్ ముందు సంజీవరావు శవం. తాను చచ్చిపోయాక కూడా హోటల్ రద్దీగా వుండడం సంజీవరావుకు నచ్చలేదు. ఎవ్వడో పెంపుడు కుక్కకు అన్న ప్రాశన చేసి పార్టీ యిస్తున్నాడు.

మనుషులు బిస్కెట్లు తినాలి కాబోలు. చీర ల్నేసే సంజీవరావు శవాన్ని జనం మెల్లి మెల్లిగా గుర్తు పట్టారు. హోటల్లో రద్దీ తగ్గింది. బతికున్నప్పుడు లేని గుర్తింపు అది. శవం ఆనం దించింది.

"ప్రొద్దున్నే వచ్చి పనడిగాడు. ముఖం చూసి చేరమన్నాను. మూడ్రూపాయిలు అడ్వాన్సడిగాడు.

కడుపు చూసి కాదన్లేదు" నాలుగు మగ్గాల బుల్లి యజమాని సంజీవరావు బతుకు పుస్తకంలోని చివరి అధ్యాయాన్ని జాగ్రత్తగా బయటపెట్టాడు. చచ్చినవాడి గతం ఆసక్తిగా వుంటుంది. జనం విన్నారు. సంజీవరావు శవం తన చిట్ట చివరి యజమాని నిజాయితీని మెచ్చుకొంది. మూడు కాదు— పాతిక రూపాయిలిచ్చానన్నా జనం నమ్ముతారు. కాని ఆ యజమాని పెద్ద పేదవాడు. శవం ముందు అబద్ధాలు చెప్పేటంత ఐశ్వర్యం అతడికి లేదు.

"ఇదీ ఆకలి చావే."

పత్రికా విలేకరి చిత్తు కాగితాల మీద గిలుక్కున్నాడు. సంజీవరావు పాలిటీషియన్ కాదు. కనీసం ఆకు రౌడీ కూడా కాదు. అయినా కేవలం చచ్చినంత మాత్రాన పేపర్లో వేస్తారా? అదే నిజమే అయితే తనలాంటి వ్యక్తికి పలు

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్

29-11-91

చావులుండడం ధర్మమనుకున్నాడు సంజీవరావు.

"ఇప్పుడే భోం చేశాడు కదా. ఎలా చచ్చి పోయాడు?"

బడిపంతులు అనుమానం పుట్టించాడు. మాస్టారి సంశయానికి నివృత్తి వుండదు. సంజీవరావుకు సైతం ఆ ప్రశ్న వచ్చినా అర్థం కాదు. బతుకుదామనే కదా తాను భోం చేశాడు?

ప్రశ్న పిల్లల్ని పెట్టింది. పిల్లలికి కాళ్ళొచ్చాయి. హోటల్ నిర్మానుష్య మయ్యింది. హోటల్ వోనరు శవం దగ్గరకు పరుగెత్తాడు.

"ఇతనా? నా హోటల్ కెప్పుడూ అమ్మతోడు నమ్మండి" జనాన్ని బతిమాలుతున్న వోనరు మీద సంజీవరావు జాలిపడ్డాడు. అందుకు వేరే కారణం కూడా వుంది. ఆ హోటల్లో ప్లేటు భోజనం ఆరు రూపాయిలు. సంజీవరావు మూడు రూపాయిలు చూపిస్తే మరో మూడు రూపాయిలు అరువు రాసుకున్నాడు. అఫ్‌కోర్స్. సంజీవరావు చేతిలో పైసా లేకుండా అదే హోటల్ చుట్టూ వారం రోజులపాటు తిరిగినా అరువు పుట్టలేదనుకోండి.

మనిషికంటె డబ్బు గొప్పది. మనిషి మనిషిని ప్రేమించడు. కాని, డబ్బు డబ్బుకు సాయపడుతుంది.

హోటల్ వోనర్ మీద సంజీవరావుకు పుట్టిన జాలి వెంటనే గిట్టింది.

"హోటల్ ముందు శవం వుంటే వ్యాపారం చేస్కోవాలా? అక్కర్లేదా? మునిసిపాల్టీ వాళ్ళకి ఫోన్ చెయ్యమంటారా?"

వోనరు మాటలు విన్న శవానికి చిర్రెత్తుకొచ్చింది. వీడికి మూడ్రూపాయిలు కాదు, మూడొందలెగవేసినా నష్టం లేదనుకొంది శవం.

"ఇది చావు కాదు. హత్య. ముమ్మాటికీ హత్యే" ప్రతిపక్ష నాయకుడు గుండెలు బాదుకున్నాడు. శవం మీద పూల మాల వేశాడు.

హోటల్ వోనర్ బిక్క చచ్చి పోయాడు.

మాల ఖరీదు యాభయి రూపాయిలు. సంజీవరావు మరణాన్ని వారం రోజులు వాయిదా వెయ్యగల మూల్యం.

శవానికి పూలు గుచ్చుకున్నాయి. భరించుకొంది.

"ఇది ప్రభుత్వం చేసిన హత్య"

ప్రతిపక్ష నాయకుడి స్పష్టమైన ఆరోపణ హోటల్ వోనర్‌కి ఊరట కలిగించింది.

జరిగిన ఘోరానికి ప్రతిపక్ష నాయకుడు గ్లిజరిన్ కార్చాడు. 'సంతాపాన్ని' చీదాడు. నటనకి అందరూ చప్పట్లు కొట్టారు. ఒక్క శవం తప్ప.

వాతావరణం అంతా ఉద్రిక్తమయ్యింది.

"అన్నపూర్ణలాంటి రాష్ట్రంలో ఆకలి చావులా? సిగ్గు సిగ్గు" నినాదాలు ఉబ్బిపోయాయి. షాపులు అద్దం ముక్కల్ని కక్కాయి. షోడాబుడ్లు నెత్తురు మింగాయి. బస్సులు నిప్పులు తొక్కాయి.

ప్రతిపక్షులు అరెస్టయ్యారు. సంజీవరావు జన్మకాక పోయినా చావు చరితార్థ మయ్యింది.

* * *

చచ్చాక కూడా సంజీవరావుకు కడుపు కోత తప్పలేదు. మంత్రిగారు దగ్గరుండి పోస్ట్‌మార్టం చేయించారు.

ఆ పూట జైల్లో ప్రతిపక్షులు. వీథుల్లో పాలకపక్షులు. అంతిమ యాత్రకు సిద్ధంగా లారీ మీద సంజీవరావు శవం. శవం కాళ్ళ దగ్గర నిలబడి మంత్రిగారు ఉపన్యాసం దంచుతున్నారు.

"మా పార్టీ కార్యకర్త సంజీవరావు మరణాన్ని రాజకీయం చెయ్యొద్దని ప్రతిపక్షాల వారిని వేడుకొంటున్నాను. వారు మా ప్రభుత్వం మీద నీచమైన ఆరోపణలు చేస్తున్నారు. ఆ ఆరోపణ ఎంత సత్యదూరమో ఈ పోస్ట్‌మార్టం రిపోర్టు చూస్తే అర్థమౌతుంది."

ఆ రిపోర్టు తాలూకు ఫోటోస్టాట్ కాపీలను విలేకరులకు పంచారు. అవార్డులిచ్చినట్టే చచ్చాక పార్టీ సభ్యత్వాలు కూడా ఇస్తారు కాబోలు.

"సంజీవరావు పొట్ట కోస్తే అన్నం దొరికింది. అన్నం తిని మరణిస్తే అది ఆకలి చావెలా అవుతుంది?' '

మంత్రిగారి ఉపన్యాసానికి చప్పట్లు, ఈలలు, పిల్లిమొగ్గలు పాదాభి వందనాలు. శవం పిడికిళ్ళు బిగించాలనుకుంది. బతికున్నప్పుడు చివరి భోజనానికి ముందు వారం రోజులు కడుపులో పేగులు ఉపవాసంతో దారాల్లా చిక్కుముడులు పడినా రాని ఆలోచన.

శవం ఒక్క తాపు తన్నాలనుకుంది. బతికున్నప్పుడు కాళ్ళ దగ్గర ముగ్గాన్ని అప్పుల వాళ్ళు బలవంతాన లాక్కుపోతున్నప్పుడు కూడా రాని ఆలోచన.

మంత్రిగారు కీడెంచి మేలెంచిన కారణంగా సంజీవరావుకు సమాధి బదులు చితిని పేర్చారు.

సంజీవరావు శవం చితినలంకరించింది.

శిరస్సు దగ్గర చిచ్చు. శిరస్సు చావును సింహావలోకనం వేసుకొంది. శవం జ్వలించింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కాళ్ళు పైకి లేచాయి. చివరి కోరిక సగమైనా తీరినందుకు సంతృప్తిపడి సంజీవరావు శవం బూడిదయ్యింది.

* * *

సంజీవరావుకి ఊరు మధ్యలో స్తూపం లేచింది. ఎవరో అజ్ఞాత వ్యక్తి తడిసిన సుద్దముక్కతో దాని మీద యిలా రాశాడు:

"ఆలస్యమయితే అన్నం విషమౌతుంది!"

**But. Man can not die by bread alone.**

●

## ● ప్రకృతి వైపరీత్యాలు
## హ్యామ్ రేడియో

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ముఖ్యంగా సమాచార సౌకర్యాలు దెబ్బతిని, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఆపదలో చిక్కుకున్న వాళ్ళకి ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సి వుంటుందో తెలియదు. "కమ్యూనికేషన్స్" పునరుద్ధరించటానికి కొంత టైం పడుతుంది. అందుకు తక్షణ "కమ్యూనికేషన్" ఏర్పాటు చేయటానికి "అమెచ్యూర్" రేడియోని మించిన సాధనం లేదు. దీనికే మరో పేరు "హ్యామ్" రేడియో. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అమెచ్యూర్ రేడియో వారు గత నెలలో యు.పి.లో జరిగిన ఘోర విపత్తును ఆదుకోవటానికి, ఇరవై మంది రేడియో ఆపరేటర్లు రేడియోలతో యు.పి. వెళ్ళి అప్పటి ప్రభుత్వానికి కమ్యూనికేషన్ ఏర్పరచటంలో సాయపడ్డారు. ఇది మన ఆంధ్రులకు గర్వకారణం.

"హ్యామ్ రేడియో" ఒక చిన్న రేడియో లాంటి ఎల్రక్ట్రానిక్ పరికరం. కరెంటు లేకపోయినా బ్యాటరీపై పని చేస్తుంది. ఒక చిన్న పరీక్ష పాసై లైసెన్సు పొందిన ప్రతి వ్యక్తీ ఈ రేడియో ఆపరేట్ చేయవచ్చు. ముఖ్యంగా ఇదొక "హాబీ"గా ఉపయోగపడ్తుంది. ప్రపంచంలో ఉన్న ఇతర "హ్యామ్ రేడియో" ఆపరేటర్లతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోవచ్చు. ఆపత్కాలమందు ప్రజలకు సేవ చేయవచ్చు. మన దేశంలో యువతీ యువకులందరూ దీనిలో శిక్షణ పొంది ఒక సత్కాలక్షేపంగానే గాక ప్రజాసేవకు కూడా ఉప యోగపడ్తారని ఆశిద్దాం.

– కె. రామారావు

